క్లుప్తంగా

వైభవంగా బాలాజీ స్వామి కల్యాణం



ఉభయ దేవేరులతో కొలువు తీరిన బాలబాలాజీ స్వామి

మామిడికుదురు: బాల తిరుపతి అప్పనపల్లి శ్రీబాలబాలాజీ స్వామివారి కల్యాణం గురువారం వైభవంగా జరిగింది. శ్రవణ నక్షత్రం సందర్భంగా స్వామివారి మాస కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చక స్వాముల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కల్యాణోత్సవంలో పలువురు భక్త దంపతులు కర్తలుగా పాల్గొన్నారు. ఆలయ ఈఓ ఎం.సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో కార్యక్రమం అత్యంత రమణీయంగా జరిగింది. స్వామివారి సన్నిధిలో నిత్యం నిర్వహించే శ్రీలక్ష్మీనారాయణ హోమంలో భక్తులు పాల్గొన్నారు. గోశాలను సందర్శించి గోవులకు పూజలు చేశారు. స్వామివారి సన్నిధిలో అమలు చేస్తున్న నిత్యాన్నదానంలో అన్న ప్రసాదం స్వీకరించారు.

ఘనంగా వాస్తు హోమాలు



బి.దొడ్డవరంలో నిర్వహిస్తున్న వాస్తు హోమాలు

మామిడికుదురు: బి.దొడ్డవరం గ్రామంలోని ఉమా సోమేశ్వరస్వామి ఆలయ విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాల్లో భాగంగా రెండో రోజు గురువారం గణపతి పూజ, వాస్తు పూజ, వాస్తు హోమాలు ఘనంగా నిర్వహించారు. ఈదరాడకు చెందిన పూజ్యం జగన్నాథశర్మ ఆధ్వర్యంలో కంభంపాటి సుబ్రహ్మణ్య శ్రీనివాసశర్మ, పోచిరాజు వెంకట రామనాగేశ్వరరావు, పోచిరాజు కిరణ్‌కుమార్ దంపతులు ప్రతిష్ఠా మహోత్సవ పూజలు చేశారు. మూలమంత్ర హోమాలు, ఉదక శాంతి, జలాధివాసం తదితర పూజలను ఘనంగా జరిపించారు. ఐదు రోజుల పాటు జరిగే ప్రతిష్ఠా మహోత్సవాలకు విశేష సంఖ్యలో భక్తులు హాజరవుతున్నారు.

ఘనంగా ఉరదాలమ్మ అమ్మవారి తీర్థం

ఆలమూరు: మండలంలోని మోదుకూరులో ఉన్న గ్రామదేవత ఉరదాలమ్మ అమ్మవారి తీర్థం గురువారం అత్యంత వైభవంగా జరిగింది. పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. అమ్మవారి ఆలయానికి గ్రామస్తులు ఊరేగింపుగా వెళ్లి, నైవేద్యాలు సమర్పించారు. గరగ రూపంలో ఉన్న అమ్మవారు ఇంటింటికీ వెళ్లగా, మహిళలు పసుపు, కుంకుమలు, నూతన వస్త్రాలను అందజేశారు. గ్రామంలో బుధవారం రాత్రి నిర్వహించిన జాతర మహోత్సవాల సందర్భంగా కళాకారులు ప్రదర్శించిన గరగ నృత్యాలు, కేరళ నృత్యాలు, విచిత్ర వేషధారణ, శక్తి వేషాలు ఆకట్టుకున్నాయి. బాణసంచా పేలుళ్లతో గ్రామం దద్దరిల్లింది. ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక, వినోద, భక్తి కార్యక్రమాలు అలరించాయి.

పలువురికి గన్నవరపు పరామర్శ



రామ్మోహన్‌రావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న శ్రీనివాసరావు తదితరులు

అయినవిల్లి: నేదునూరు మాజీ సర్పంచ్ కామన కృష్ణమూర్తి సోదరుడు రామ్మోహన్‌రావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. అలాగే స్థానిక ఆదర్శనగర్‌కు చెందిన కొల్లు వెంకటరమణ ఇటీవల గుండెపోటుతో మరణించారు. మృతుల కుటుంబాలను వైఎస్సార్ సీపీ పి.గన్నవరం నియోజకవర్గ ఇన్‌చార్జి, జెడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసరావు, పార్టీ మండల అధ్యక్షుడు కుడుపూడి విద్యాసాగర్ గురువారం పరామర్శించారు. మృతుల చిత్రపటాలకు నివాళులర్పించారు. వీరివెంట పార్టీ నాయకులు గుత్తుల నాగబాబు, కొల్లు శేఖర్, బొంతు సత్తిబాబు, పినిపే బుజ్జి, తిప్పా చైతన్యకృష్ణ, వస్కా రామారావు ఉన్నారు.

రోడ్డు భద్రత నియమాలపై అవగాహన అవసరం

రావులపాలెం: వాహనదారులు, డ్రైవర్లు రహదారి భద్రత నియమాలపై అవగాహన పెంపొందించుకోవాలని ఎంవీఐ వి.శ్రీనివాస్ అన్నారు. స్థానిక సెయింట్ పెట్రిక్స్ స్కూల్లో గురువారం జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలలో భాగంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఆటో, క్యాబ్, స్కూల్ బస్, ఎల్ఎంవీ, ట్రక్ డ్రైవర్లకు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. వాహనాలు నడిపేటప్పుడు సీట్ బెల్ట్, హెల్మెట్ ధరించాలన్నారు. మద్యం సేవించి, అతివేగంగా వాహనాలు నడపరాదని చెప్పారు. ఈ సందర్భంగా రక్తదానం చేసిన డ్రైవర్లకు ప్రశంసాపత్రాలిచ్చి సత్కరించారు. వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో నిర్వహించిన క్విజ్ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంవీఐ ఓలేటి శ్రీనివాస్, ఏఎంవీఐ ఆర్.షణ్ముఖి, బండారు సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

చదువు పదిలమేనా..?

- టెన్త్‌లో ఉత్తమ ఫలితాలకు విద్యా శాఖ వంద రోజుల ప్రణాళిక
- ఇప్పటి వరకు పంపిణీ కాని స్టడీ మెటీరియల్
- ఎదురుచూస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు
- మిగిలింది ఇక 41 రోజులే..!



ఇసుకపూడి జెడ్పీ హైస్కూల్‌లో చదువుకుంటున్న టెన్త్ విద్యార్థులు

అంబాజీపేట: విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో మెరుగైన ఫలితాలను సాధించేందుకు విద్యా శాఖ ప్రణాళికలు సిద్ధం చేసి, ప్రత్యేక తరగతులను నిర్వహిస్తోంది. విద్యార్థులకు అవసరమైన మెటీరియల్ మాత్రం ఇంతవరకూ పంపిణీ చేయలేదు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో సకాలంలో విద్యార్థులకు మెటీరియల్ పంపిణీ చేసింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం మెటీరియల్ పంపిణీ చేస్తామన్నా.. ఇప్పటి వరకు విద్యార్థులకు అందలేదు. దీంతో ప్రావీణ్యం కలిగిన ఉపాధ్యాయులు తయారు చేసిన మెటీరియల్‌తోనే విద్యార్థులను సన్నద్ధం చేయాల్సి వస్తోంది. పి.గన్నవరం, రాజోలు, కొత్తపేట నియోజకవర్గాల పరిధిలోని 11 మండలాల నుంచి 11,320 మంది విద్యార్థులు పరీక్షలకు సిద్ధమవుతున్నారు.

గడిచిపోయిన 59 రోజులు

ఈ ఏడాది మార్చి 17 నుంచి 31వ తేదీ వరకు పరీక్షలను నిర్వహించేందుకు విద్యా శాఖ చర్యలు చేపట్టింది. పరీక్షలకు రాయడానికి విద్యార్థులకు 41 రోజులు మాత్రమే మిగిలి ఉంది. మెరుగైన ఫలితాల సాధన దిశగా వంద రోజుల ప్రణాళిక సిద్ధం చేశామని, విద్యార్థులకు అవసరమైన మెటీరియల్ పంపిణీ చేస్తామంటూ ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించింది. దీంతో మెటీరియల్ అదిగో వస్తుంది, ఇదిగో వస్తుందంటూ విద్యార్థులు, ఉపాధ్యాయులు ఎదురు చూస్తున్నారు. వంద రోజుల్లో 58 రోజులు ఇప్పటికే గడిచిపోయాయి. ఇంకా మిగిలింది 41 రోజులు మాత్రమే. కూటమి ప్రభుత్వ హయాంలో ఒక్క స్టడీ మెటీరియల్ కూడా ఇవ్వకుండా, రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణా సంస్థ అందించిన ప్రశ్నాపత్రాలతోనే సరిపెట్టి చేతులు దులుపుకొంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పరీక్షలకు రెండు, మూడు నెలల ముందే విద్యా జ్యోతి పేరుతో ప్రత్యేక స్టడీ మెటీరియల్‌ను రూపొందించి. విద్యార్థులకు పంపిణీ చేసింది. ప్రస్తుత వంద రోజుల ప్రణాళికతో పాటు, విద్యార్థులకు అవసరమైన మెటీరియల్ పంపిణీ చేయాల్సి ఉన్నా, ఇంతవరకూ అందజేయలేదు. స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేస్తే సగటు విద్యార్థులు ఉత్తీర్ణత. సాధించడంతో పాటు, మంచి మార్కులను పొందడానికి ఎంతగానో దోహదపడేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పంపిణీ చేసిన వెంటనే అందిస్తాం



పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేస్తున్నాం. వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ఉదయం, సాయంత్రం వేళల్లో పత్యేక తరగతులను నిర్వహిస్తున్నాం. వంద రోజుల ప్రణాళికలో భాగంగా సిలబస్ ప్రకారం ప్రత్యేక శిక్షణ ఇచ్చి, 50 రివిజన్ టెస్ట్‌లు నిర్ణయించగా.. ఇప్పటి వరకు 30 టెస్టులను ప్రతి రోజూ అన్ని సబ్జెక్టులపై నిర్వహించాం. ప్రభుత్వం ఇచ్చిన ప్రశ్నాపత్రాలను విద్యార్థులతో చదివిస్తున్నాం. స్టడీ మెటీరియల్‌ను ప్రభుత్వం పంపిణీ చేసిన వెంటనే విద్యార్థులకు అందిస్తాం.

– మోకా ప్రకాష్, ఎంఈఓ–2, అంబాజీపేట

ప్రణాళికాబద్ధంగా తరగతుల నిర్వహణ



దాతల సహకారంతో స్టడీ మెటీరియల్‌ను విద్యార్థులకు అందించాం. ప్రణాళికాబద్ధంగా ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నాం. వెనుకబడి ఉన్న విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి చైతన్య పరుస్తున్నాం. ప్రభుత్వం నుంచి రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణా సంస్థ అందించిన ప్రశ్నాపత్రాలతో విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తున్నాం. జిల్లా కామన్ ఎగ్జామ్ సెంటర్ నుంచి రివిజన్ టెస్ట్‌లను ప్రతి రోజూ పెడుతున్నాం.

– కదలి సాయిరామ్, హెచ్ఎం, జెడ్పీ హైస్కూల్, అంబాజీపేట

అభివృద్ధి కమిటీలో స్థానికులకే ప్రాధాన్యమివ్వాలి

కలెక్టర్‌కు స్థానికుల వినతి



పల్లిపాలెం ఫిషింగ్ హార్బర్‌లో కలెక్టర్‌తో మాట్లాడుతున్న స్థానికులు

సఖినేటిపల్లి: పల్లిపాలెం ఫిషింగ్ హార్బర్ అభివృద్ధికి ఏర్పాటు చేయబోయే కమిటీలో తమకే చోటు కల్పించాలని స్థానికులు కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్‌కు విజ్ఞప్తి చేశారు. గురువారం పల్లిపాలెంలో బోటింగ్ పాయింట్ ఉన్న హార్బర్‌ను కలెక్టర్ సందర్శించారు. హార్బర్‌లో సదుపాయాలు కల్పించాలని మత్స్యకార ప్రతినిధులు కలెక్టర్‌ను కోరారు. హార్బర్ ఏర్పాటులో తమ సొసైటీకి సంబంధించిన స్థలాలు ఇచ్చామని, ఇక్కడే జీవనోపాధి పొందుతున్నామని విన్నవించారు. కమిటీలో ప్రాధాన్యం కూడా తమకే ఇవ్వాలని స్థానికులు కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. కలెక్టర్ వెంట జేసీ నిశాంతి, డీఎస్పీ ప్రసాద్, ఆర్డీవోలు మాధవి, అఖిల, ఫిషరీస్ ఏడీ హర్షవర్ధన్, దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ సత్యనారాయణ, తహసీల్దార్ ఎం.వెంకటేశ్వరరావు ఉన్నారు.

బాల కార్మికులతో పని చేయించవద్దు

కార్మిక శాఖాధికారి నాగమల్లేశ్వరరావు



ఆలమూరులో ఇటుక బట్టీ కార్మికులతో మాట్లాడుతున్న నాగమల్లేశ్వరరావు

ఆలమూరు: ఇటుక బట్టీలలో బాల కార్మికులను చేర్చుకోవద్దని మండపేట కార్మిక శాఖాధికారి నాగమల్లేశ్వరరావు యజమానులను ఆదేశించారు. ఆలమూరులోని ఇటుక పరిశ్రమలను గురువారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సంస్థల యజమానులు తప్పనిసరిగా కార్మికుల రిజిస్టర్లు, రికార్డులు నిర్వహించాలన్నారు. కార్మిక చట్టాలను సమర్థంగా అమలు చేసి, వారి హక్కులను పరిరక్షించాలన్నారు. పని ప్రదేశాలలో కార్మిక చట్టాలను అమలు చేసే బాధ్యత యాజమాన్యాలపై ఉందన్నారు. అనంతరం ఇటుక పరిశ్రమల్లో పని చేస్తున్న కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అలాగే రికార్డులలో ఉన్న లోపాలను సవరించుకోవాలని సూచించారు. ఒక్కొక్క కార్మికునికి రూ.వంద చొప్పున కార్మిక సంక్షేమ నిధికి చెల్లించి, కార్మికులకు అండగా నిలవాలన్నారు. కార్మికులకు విధిగా కార్మిక వేతన చట్టం అమలు చేయాలని తెలిపారు.

వాసవీమాతకు నేడు ప్రత్యేక పూజలు

కొత్తపేట: ఆర్యవైశ్యుల ఇలవేల్పు వాసవీ కన్యకాపరమేశ్వరీ అమ్మవారి ఆత్మాహుతి రోజును పురస్కరించుకుని శుక్రవారం స్థానిక వాసవీమాతకు ప్రత్యేక పూజలు, ఆలయ ప్రాంగణంలో వివిధ హోమాలు నిర్వహిస్తున్నట్టు ఆర్యవైశ్య సంఘాల సమాఖ్య సభ్యులు తెలిపారు. ఉదయం నుంచి రాత్రి వరకూ సామూహికంగా లక్ష్మీగణపతి, వాసవీ, మహాలక్ష్మి, నక్షత్ర, నవగ్రహ హోమాలు, మహిళలతో సామూహిక కుంకుమ పూజలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

చింతలపల్లి-లక్కవరం రోడ్డు పనులు పునఃప్రారంభం

రాజోలు: కొన్నేళ్లుగా పలు సాంకేతిక కారణాలతో నిలిచిన చింతలపల్లి-లక్కవరం రోడ్డు నిర్మాణ పనులు గురువారం పునఃప్రారంభమయ్యాయి. ఈ పనులను ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ గురువారం పరిశీలించారు. సుమారు నాలుగున్నర కి.మీ. మేర రోడ్డు నిర్మాణానికి రూ.11 కోట్ల నిధులు 2019లో మంజూరు కాగా, పనులు జరగలేదని ఎమ్మెల్యే వివరించారు. రెండు కి.మీ. సీసీ రోడ్డు, రెండున్నర కి.మీ. బీటీ రోడ్డు నిర్మిస్తారన్నారు. గ్రామాల పరిధిలో రోడ్డు విస్తరణతో పాటు, ఇరువైపులా డ్రైనేజీలు నిర్మించేలా అధికారులకు సూచించామన్నారు. చింతపల్లి సర్పంచ్ మట్టా ప్రసన్నకుమారి, మండల ఉపాధ్యక్షుడు ఇంటిపల్లి ఆనందరాజు ఉన్నారు.

బీజేపీ నేతల భేటీ

మలికిపురం: ఎమ్మెల్యే దేవ వరప్రసాద్‌తో నియోజకవర్గ బీజేపీ నేతలు భేటీ అయ్యారు. విశ్వేశ్వరాయపురంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయనను కలిసి స్థానిక నామినేటెడ్ పదవుల్లో బీజేపీకి కూడా ప్రాధాన్యమివ్వాలని కోరారు.

శ్వాసతోనే ఆనందం, ఆరోగ్యం

అంబాజీపేట: శ్వాసపై ధ్యాస పెట్టడం ద్వారా విశ్వమయ ప్రాణశక్తి శిరస్సులోని బ్రహ్మ రంధ్రం ద్వారా శరీరంలోకి ప్రవేశించి, అన్ని నాడులను ఉత్తేజం చేసి.. ఆరోగ్యాన్ని, ఆనందాన్ని కలుగజేస్తుందని పి.గన్నవరానికి చెందిన సీనియర్ పిరమిడ్ మాస్టర్ బొరుసు ధనలక్ష్మి అన్నారు. కొర్లపాటివారిపాలెంలో ఉన్న శ్రీ భూ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో గురువారం పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీస్ మూవ్‌మెంట్ అంబాజీపేట ప్రతినిధి పళ్ల భాగ్యలక్ష్మీకుమారి ఆధ్వర్యంలో సామూహిక ధ్యాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ధనలక్ష్మి మాట్లాడుతూ, ధ్యానం అన్ని సమస్యలకు పరిష్కార మార్గమని చెప్పారు. నాసికారంధ్రాల ద్వారా లోపలకు, బయటకు వచ్చే గాలిని గమనించడమే ధ్యానమని విశ్లేషించారు. తొలుత వేంకటేశ్వరస్వామి వారి శ్రావణా నక్షత్రం సందర్భంగా ఆలయ అర్చకులు పాణంగిపల్లి నరసింహాచార్యులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్న సమారాధన జరిగింది.

స్పర్శ లేకపోవడం కుష్ఠు లక్షణం కావచ్చు



అంబాజీపేటలో ప్రతిజ్ఞ చేస్తున్న వైద్య సిబ్బంది

అంబాజీపేట: శరీరంపై స్పర్శ లేకపోవడం కుష్ఠు వ్యాధి లక్షణం కావచ్చని వైద్యాధికారి కేఎస్ శ్రీనివాస్ తెలిపారు. ఇటువంటి లక్షణాలు కనిపించిన వెంటనే ప్రభుత్వాస్పత్రి వైద్యుడిని సంప్రదించి, మందులు వాడడం శ్రేయస్కరమన్నారు. అంబాజీపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సీహెచ్‌వో బి.అప్పారావు అధ్యక్షతన కుష్ఠు రహిత మండలంగా చేసేందుకు బుధవారం ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి శ్రీనివాస్, సీహెచ్ఓ అప్పారావు మాట్లాడుతూ, కుష్ఠు వ్యాధిగ్రస్తులు క్రమం తప్పకుండా మందులు వాడడం ద్వారా వ్యాధిని నయం చేయవచ్చని అవగాహన కల్పించారు. అంతకుముందు గాంధీ వర్ధంతిని నిర్వహించారు.

సమష్టి కృషితో వ్యాధి నిర్మూలన

ఆలమూరు: కుష్ఠు వ్యాధి నిర్మూలన ధ్యేయంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కొత్తపేట డివిజన్ వైద్యాధికారి ఎం.సుమలత అన్నారు. మండలంలోని పెదపళ్ల, చొప్పెల్ల పీహెచ్‌సీల్లో కుష్ఠు వ్యాధి నివారణ పక్షోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా వైద్యాధికారులు డి.సువర్చలాదేవి, డి.సాయికిషోర్ ఆధ్వర్యంలో హెచ్ఈలు ఏవీవీ రాజా, జ్యోతికుమార్, సూర్యనారాయణ తదితరులు కుష్ఠు వ్యాధి నిర్మూలన, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. బహుళ ఔషధ చికిత్స(ఎండీటీ) అందుబాటులో ఉన్నందున రోగులకు ఆందోళన అవసరం లేదన్నారు. ఈ వ్యాధిపై అవగాహన పెంచుకుని, జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం ఆయా సచివాలయాల వద్ద ఆరోగ్య సిబ్బంది కుష్ఠు వ్యాధి నిర్మూలన కరపత్రాలను ఆవిష్కరించారు. ఆయా గ్రామాల్లో స్పర్శ కార్యక్రమంలో భాగంగా కుష్ఠు వ్యాధి నిర్మూలనకు వైద్యారోగ్య సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.శివప్రసాద్, పి.ఉమ, ఆర్.బాలామణి పాల్గొన్నారు.

గాంధీ మార్గం.. ఆదర్శనీయం

వర్ధంతి సందర్భంగా ప్రముఖుల నివాళి



అంబాజీపేటలో గాంధీ చిత్రపటానికి శ్రద్ధాంజలి ఘటిస్తున్న ఎంపీపీ వెంకటేశ్వరరావు తదితరులు



కుష్ఠు రోగులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న జిల్లా వైద్యారోగ్య అధికారి భరతలక్ష్మి



కొత్తపేట డిగ్రీ కళాశాలలో గాంధీ విగ్రహానికి ప్రిన్సిపాల్ పెద్దిరాజు తదితరుల నివాళులు



రాజోలులో గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే, ఇతర నాయకులు

అంబాజీపేట: పల్లెలే దేశానికి పట్టుగొమ్మలని, గ్రామాల అభివృద్ధితోనే దేశం పురోగతి సాధిస్తుందన్న జాతిపిత మహాత్మాగాంధీ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, ఎంపీటీసీల సమాఖ్య మండల అధ్యక్షుడు ముత్తాబత్తుల ప్రశాంత్ అన్నారు. అంబాజీపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద గాంధీ వర్ధంతిని గురువారం నిర్వహించారు. వైస్ ఎంపీపీ నేతల నాగరాజు, ఎంపీటీసీ కుసుమ వెంకటేష్, ఉందుర్తి నాగబాబు తదితరులు పాల్గొన్నారు. స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయ ప్రాంగణంలోని గాంధీ విగ్రహానికి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలోను, అంబాజీపేట, తొండవరం జెడ్పీ హైస్కూళ్లలో గాంధీ వర్ధంతిని నిర్వహించారు.

అహింసా మార్గంతో..

కొత్తపేట: గాంధీ అనుసరించిన అహింసా మార్గాన్ని ఆదర్శంగా తీసుకోవడం ద్వారా శాంతియుత సమాజాన్ని సాధించవచ్చని స్థానిక విశ్వకవి వేమన ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పెద్దిరాజు అన్నారు. గాంధీ వర్ధంతి సందర్భంగా హిస్టరీ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో కళాశాల ప్రాంగణంలో గాంధీ విగ్రహానికి ప్రిన్సిపాల్ డాక్టర్ పెద్దిరాజు నివాళులర్పించారు. కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో గాంధీ విగ్రహానికి అధికారులు, సిబ్బంది నివాళులర్పించారు. మండల ఆర్యవైశ్య సంఘాల ఆధ్వర్యంలో వాసవీ కన్యకాపరమేశ్వరీ కల్యాణ మండపం, సమితి రోడ్డు, పాత బస్టాండ్ సెంటర్, పంచాయతీ పార్కుల్లో గాంధీ విగ్రహాలకు ఆర్యవైశ్య సంఘాల నాయకులు పూలమాలలు వేసి, శ్రద్ధాంజలి ఘటించారు. పలివెలలో మహాత్మా గాంధీ అధ్యయన సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి దుళ్ల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మహాత్ముని విగ్రహానికి నివాళులర్పించారు. వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలల్లో వర్ధంతి కార్యక్రమాలు జరిగాయి.

వివిధ గ్రామాల్లో..

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో గాంధీ వర్ధంతి జరిగింది. అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో, గ్రామ సచివాలయాల్లో అధికారులు, సిబ్బంది గాంధీజీ చిత్రపటానికి నివాళులర్పించారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, జెడ్పీటీసీ తోరాటి సీతామహాలక్ష్మి, ఎంపీడీఓ ఎ.రాజు పాల్గొన్నారు. స్వాతంత్రోద్యమానికి గాంధీజీ పోరాడిన తీరును మననం చేసుకున్నారు. సంధిపూడి, గుమ్మిలేరు, చెముడులంక, చొప్పెల్ల, పెదపళ్ల, మూలస్థాన అగ్రహారం గ్రామాల్లోని గాంధీ విగ్రహాల వద్ద స్థానికులు, అభిమానులు నివాళులర్పించారు. పెదపళ్ల, చొప్పెల్ల పీహెచ్‌సీల్లో వైద్యాధికారులు డి.సాయికిషోర్, డి.సువర్చలాదేవి నేతృత్వంలో వైద్యారోగ్య సిబ్బంది గాంధీజీ చిత్రపటానికి శ్రద్ధాంజలి ఘటించారు.

స్ఫూర్తిదాయకుడు

రాజోలు: జాతిపిత మహాత్మా గాంధీ ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకుడని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. స్థానిక గాంధీ బొమ్మ సెంటర్‌లో, పొన్నాడ హౌస్ వద్ద విగ్రహాలకు ఆయన నివాళులర్పించారు. ఎంపీటీసీ దార్ల కుమారిలక్ష్మి, మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీవేమా, డీసీ అధ్యక్షుడు పినిశెట్టి బుజ్జి, సీనియర్ న్యాయవాది పొన్నాడ సూర్యారావు, డెల్టా చైర్మన్ గుబ్బల శ్రీనివాస్, కాట్నా రాజు పాల్గొన్నారు.

వ్యాధిగ్రస్తులపై ప్రేమాభిమానాలు

మామిడికుదురు: పాశర్లపూడిలంక పంచాయతీ వద్ద గురువారం గ్రామసభ జరిగింది. గాంధీ చిత్రపటానికి సర్పంచ్ తెలగారెడ్డి సూర్యప్రకాశరావు పూలమాల వేసి నివాళులర్పించారు. కుష్ఠు వ్యాధిగ్రస్తులపై గాంధీజీ ప్రేమానురాగాలు చూపారని హెల్త్ అసిస్టెంట్ ఏడిక కవీంద్ర అన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ చెరుకూరి పార్వతీదేవి, పంచాయతీ కార్యదర్శి డి.సురేష్, ఏఎన్ఎం మట్టపర్తి కస్తూరి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కుష్ఠు రోగులకు దుప్పట్లు పంపిణీ

అయినవిల్లి: గాంధీ వర్ధంతి సందర్భంగా విలస న్యూలైఫ్ సెంటర్‌లో కుష్ఠు రోగులకు జిల్లా వైద్యారోగ్య అధికారి భరతలక్ష్మి ఆధ్వర్యంలో దుప్పట్లు, పండ్లు, బెడ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. సక్షమ్ వైద్యుల ఆధ్వర్యంలో రోగులకు ఉచితంగా మందులు, భోజనం ప్యాకెట్లు అందజేశారు. వైద్యాధికారి సంతోష్‌కుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రావులపాలెం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ పి.శ్రీనివాసరావు అధ్యక్షతన గాంధీ చిత్రపటానికి నివాళులర్పించారు. స్వాతంత్ర్య సంగ్రామంలో గాంధీజీ కృషిని వివరించారు. ఎన్ఎస్ఎస్ అధికారి ఎస్.అరుణ్‌కుమార్, అధ్యాపకులు సుభాషిణి, బీపీఎన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

పడమటిపాలెంలో పశువైద్య శిబిరం

మలికిపురం: మండలంలోని పడమటిపాలెంలో గురువారం లక్కవరం పశు వైద్యశాల అధికారులు ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. వైద్యాధికారి పి.సూర్యనారాయణరాజు ఆధ్వర్యంలో సిబ్బంది పశువులకు గర్భకోశ పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. మొత్తం 60 పశువులకు, 76 కోళ్లకు, 30 మేకలకు నట్టల నివారణ మందులు అందించారు.

లారీ ఢీకొని వీఆర్‌ఏకు తీవ్ర గాయాలు

అంబాజీపేట: నిర్లక్ష్యంతో లారీని రివర్స్ చేస్తూ మోటార్ సైకిల్‌ను ఢీకొట్టడంతో వీఆర్‌ఏకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు, పి.గన్నవరం మండలం నరేంద్రపురానికి చెందిన వీఆర్‌ఏ బీర పెదసత్యనారాయణ తన మోటార్ సైకిల్‌పై బుధవారం సాయంత్రం అంబాజీపేట నుంచి ఇంటికి వెళుతున్నారు. మాచవరం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు వద్దకు వచ్చేసరికి లారీ రివర్స్ చేస్తూ వీఆర్‌ఏ మోటార్ సైకిల్‌ను బలంగా ఢీకొంది. ఈ ఘటనలో గాయపడిన వీఆర్‌ఏను స్థానికులు అమలాపురం ఆస్పత్రికి తరలించారు. ఆయన ఫిర్యాదు మేరకు అదే రోజు రాత్రి కేసు నమోదు చేసినట్టు హెచ్‌సీ ప్రసాద్ తెలిపారు.

బాధితులకు ఆర్థిక సాయం

సఖినేటిపల్లి: మండలంలోని కేశవదాసుపాలెంలో గురువారం అంగవైకల్యం, అనారోగ్యంతో బాధపడుతున్న ఇద్దరికి రూ.5 వేల చొప్పున జెడ్పీటీసీ దొండపాటి అన్నపూర్ణ ఆర్థికసాయం అందజేశారు. తెలుగు క్రిస్టియన్ ఫెలోషిప్ దోహ, కతర్ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు వి.ప్రకాష్‌బాబు, టి.అరుణ్, నల్లి ప్రసాద్, దిలీప్ రాజా, సుధాకర్ కలిసి ఈ మొత్తాన్ని సమకూర్చారు. బాధితులు లంక రమేష్, డి.విజయకుమారికి సాయాన్ని అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల ఉపాధ్యక్షురాలు పెదపాటి నాగమణి, ఓగూరి విజయ్‌కుమార్, వై.ఏసుబాబు, డి.పూర్ణప్రకాష్ పాల్గొన్నారు.

సొసైటీ మాజీ అధ్యక్షుడు వెర్రియ్యకు ప్రముఖుల నివాళి

కొత్తపేట: ప్రముఖ బీసీ నాయకుడు, అవిడి విశాల సహకార పరపతి సంఘం మాజీ అధ్యక్షుడు బొక్కా వెర్రియ్య మృతికి పలువురు ప్రముఖులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు సంతాపం ప్రకటించారు. ఖండ్రిగ గ్రామానికి చెందిన వెర్రియ్య ఐదు నెలలుగా అనారోగ్యంతో బాధపడుతూ, ఈ నెల 19న హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో కన్నుమూశారు. అవిడి సొసైటీ అధ్యక్షునిగా, జిల్లా శెట్టిబలిజ సంఘం, బీసీ సంక్షేమ సంఘం నాయకునిగా, కాన్షీరామ్ నాయకత్వంలో బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా సేవలందించారు. గురువారం వెర్రియ్య దశదినకర్మ కార్యక్రమాన్ని ఖండ్రిగలో ఆయన స్వగృహం వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో పలువురు బీసీ, రాజకీయ నాయకులు వెర్రియ్య చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

600 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

కొత్తపేట: సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 600 లీటర్ల బెల్లపు ఊటను గురువారం ధ్వంసం చేసినట్టు ఎక్సైజ్ సీఐ కె.కాత్యాయని తెలిపారు. కాకినాడ ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ వి.రేణుక ఆదేశాల మేరకు ఎక్సైజ్ దాడులు నిర్వహించారు. ఎక్సైజ్ ఎస్సై కె.అన్నవరం ఆధ్వర్యంలో ఆత్రేయపురం మండలం బొబ్బర్లంక సమీప గోదావరి పరివాహక లంకలో దాడి చేశారు. సారా తయారీకి వినియోగించే బెల్లపు ఊట నిల్వ చేసిన ప్లాస్టిక్ పీపాలను గుర్తించారు. ప్లాస్టిక్ పీపాలను, ఊటను ఎక్సైజ్ సిబ్బంది ధ్వంసం చేశారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

ఆలమూరు: మండలంలోని చొప్పెల్ల, ఆలమూరు సబ్‌స్టేషన్ల పరిధిలో శుక్రవారం పలు గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని రామచంద్రపురం ఈఈ కె.రత్నాలరావు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా పినపళ్ల, పెదపళ్ల, నర్సిపూడి, నవాబుపేట, గుమ్మిలేరు, మోదుకూరు, పెనికేరు, కలవచర్ల, ఆలమూరు, జొన్నాడ, మూలస్థాన అగ్రహారం, మడికి, చెముడులంక, చొప్పెల్ల తదితర గ్రామాలకు ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకూ సరఫరా ఉండదని వివరించారు.

చిత్తడి నేలల్లో జీవరాసుల వృద్ధి



సఖినేటిపల్లిలంకలో విద్యార్థులతో కలిసి ర్యాలీ చేస్తున్న ప్రభావతి

సఖినేటిపల్లి: జీవరాసుల్లో 70 శాతం చిత్తడి నేలల్లోనే వృద్ధి చెందుతున్నాయని ఏపీ ఎన్జీసీ స్టేట్ మానిటరింగ్ ఆఫీసర్ గుండేపల్లి ప్రభావతి అన్నారు. ఏపీ ఎన్జీసీ ఆధ్వర్యంలో గురువారం ప్రపంచ చిత్తడి నేలల సంరక్షణ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా పది రోజుల పాటు నిర్వహించే ఈ బృహత్తర కార్యక్రమానికి సఖినేటిపల్లిలంకలో ఆమె శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, చిత్తడి నేలల ప్రాముఖ్యాన్ని తెలియజేస్తూ, చిత్తడి నేలలు భూసారాన్ని ఎలా పెంచుతున్నాయో వివరించారు. 1997 ఫిబ్రవరి 2 నుంచి ప్రపంచ చిత్తడి నేలల దినోత్సవం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. అనంతరం విద్యార్థులతో కలిసి గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. పాఠశాల ఉపాధ్యాయులు, పెద్దలు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలకు కృషి చేయాలి



అంతర్వేదికర జెడ్పీ ఉన్నత పాఠశాలను పరిశీలిస్తున్న సూర్యప్రకాష్

సఖినేటిపల్లి: పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా తగిన కృషి చేయాలని ఉప విద్యాశాఖాధికారి జి.సూర్యప్రకాష్, ఉపాధ్యాయులకు సూచించారు. గురువారం అంతర్వేదికర, అంతర్వేది దేవస్థానం జెడ్పీ ఉన్నత పాఠశాలలను, అంతర్వేదికర సెయింట్ మేరీ స్కూల్‌ను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. టెన్త్ విద్యార్థుల సామర్థ్యాలపై పలు ప్రశ్నలడిగి తెలుసుకున్నారు. ప్రతి రోజు సాయంత్రం పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులను నిర్వహించాలని చెప్పారు. ఈ సందర్భంగా పాఠశాలల సిబ్బందితో సమావేశాలు నిర్వహించారు. హెచ్ఎంలు సూర్యకుమారి, ప్రసాద్, బ్రహ్మాజీ, రాంబాబు పాల్గొన్నారు.